అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్ నిర్మాణం

- రాష్ట్రంలోనే ప్రప్రథమం
- రూ.50.90 కోట్లతో పనులు ప్రారంభం


జేసీబీలతో మార్కెట్ నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ అధ్వానంగా ఉండేది. వర్షాకాలంలో నీరు నిలిచి మార్కెట్ వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. బురదమయంగా ఉండటంతో మహిళలు మార్కెట్‌కు రావడానికి భయపడేవారు. మరో వైపు దుమ్ము ధూళితో అవస్థలు పడేవారు. ఈ సమస్య తీవ్రతను గుర్తించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి పట్టుబట్టి మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు.

అత్యాధునిక సౌకర్యాలతో..

రాష్ట్రంలోనే ప్రప్రథమంగా అత్యాధునిక సౌకర్యాలతో ప్రొద్దుటూరు పట్టణంలో కూరగాయల మార్కెట్‌ను నిర్మిస్తున్నారు. 2.38 ఎకరాల విస్తీర్ణంలో మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 1980 ప్రాంతంలో పట్టణ నడిబొడ్డున ఉన్న శివాలయం ఎదురుగా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. కాలక్రమేణ జనాభా పెరగడంతోపాటు మార్కెట్ శిథిలావస్థకు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రెండు మూడు మార్లు ఎన్నికల సందర్భంగా పాలకులు మార్కెట్‌ను నిర్మిస్తామని చెప్పినా ఆ హామీని నెరవేర్చలేకపోయారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో ఎలాగైనా కొత్తమార్కెట్ నిర్మించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నిర్ణయించారు. ఎన్ని అవంతరాలు ఎదురైనా లెక్క చేయకుండా శిథిలావస్థకు చేరిన మార్కెట్‌ను తొలగించి తాత్కాలిక మార్కెట్‌ను మున్సిపల్ మైదానంలో ఏర్పాటు చేశారు. కేవలం రెండు నెలల్లోనే తాత్కాలిక మార్కెట్‌ను అద్భుతంగా తీర్చిదిద్దారు.

ఎమ్మెల్యే కార్పొరేట్ సంస్థలకు అమ్మారని దుష్ప్రచారం

ఉన్న మార్కెట్‌ను తొలగించి స్థలాన్ని కార్పొరేట్ సంస్థలకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి లీజుకు ఇచ్చారని, టీడీపీ నేతలు దుష్ప్రచారం చేశారు. వ్యాపారులందరూ తాత్కాలిక మార్కెట్‌లోనే ఉండాల్సి ఉంటుందన్నారు. ఎవరి మాటలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి లెక్క చేయలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సంప్రదించి మార్కెట్ నిర్మాణానికి రూ.50.90 కోట్లు నిధులు మంజూరు చేయించారు. 2021 డిసెంబర్ 23న మార్కెట్ నిర్మాణానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పారిపాలన, సాంకేతిక అనుమతులు మంజూరైన అనంతరం 2022 నవంబర్ 15న మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి ఆర్‌కే రోజా, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరు కాగా, కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కేపీసీ ప్రాజెక్ట్స్ ఈ మార్కెట్ నిర్మాణాన్ని చేపడుతోంది. ప్రస్తుతం ఎర్త్ వర్క్ పూర్తి అయింది.

నిర్మాణం ఇలా..

2.38 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న మార్కెట్‌లో షాపింగ్ గదులతోపాటు సెల్లార్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో 8''8 అడుగుల విస్తీర్ణంలో 356 షాపింగ్ గదులు, 10''15 అడుగుల విస్తీర్ణంలో 46 స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఫస్ట్ ఫ్లోర్‌లో 20''16 అడుగుల విస్తీర్ణంలో 30 రీటైల్ షాపింగ్ గదులు, గ్రౌండ్ ఫ్లోర్‌లో 32 షాపింగ్ గదులు కలిపి మొత్తం 62 గదులు నిర్మించనున్నారు. వీటితోపాటు టూ వీలర్స్, ఫోర్ వీలర్స్ పార్కింగ్ కోసం ప్రత్యేకంగా సెల్లార్ జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక సౌకర్యాలు

మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, లిఫ్ట్‌ల సౌకర్యం, ఆహ్లాదకరమైన గ్రీనరీ ఏర్పాటుతోపాటు తదితర సౌకర్యాలు కల్పించనున్నారు.

ఎర్త్ వర్క్ పూర్తయింది



కూరగాయల మార్కెట్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటి వరకు ఎర్త్ వర్క్ పూర్తయింది. మార్కెట్ డిజైన్స్‌కు సంబంధించి అప్రూవల్ రావాల్సి ఉంది. రెండేళ్లలో మార్కెట్‌ను నిర్మించేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు.

- పి.వెంకటరమణయ్య, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన


రోగులకు మందులు అందిస్తున్న గంగాధర్‌రెడ్డి

ఖాజీపేట : ఖాజీపేట ప్రజల కోసం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. ఖాజీపేట షాదీఖానాలో ఎస్ఎల్ఆర్ హాస్పిటల్ వారి సహకారంతో డాక్టర్ మూలే రామ అనిల్‌కుమార్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్ ప్రారంభించారు. గుండెకు సంబంధించిన పరీక్షలను వచ్చిన రోగులకు ఉచితంగా పరీక్షించారు. మందులతోపాటు రోగులకు కావాల్సిన వైద్య సూచనలు చేశారు.

లైన్‌మెన్‌కు ఆర్థిక సాయం


విద్యుత్ సిబ్బందికి నగదును అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణారెడ్డి

కలసపాడు : మండలంలోని రాజుపాలెం సచివాలయ విద్యుత్ లైన్‌మెన్ సురేష్ ఇటీవల రాజుపాలెం వద్ద విద్యుత్ మరమ్మతులు చేపడుతుండగా విద్యుత్ షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలై తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లైన్‌మెన్ సురేష్‌కు బ్రాహ్మణపల్లె గ్రామ ప్రజలు రూ.లక్ష నగదు సేకరించి ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, రాజుపాలెం గ్రామపంచాయతీ సర్పంచ్ సూదా రామకృష్ణారెడ్డి చేతులమీదుగా కలసపాడులో విద్యుత్ సిబ్బందికి అందజేశారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కమిటీ వారు రూ.1.20 లక్షలు సేకరించి ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు వెంకటరామిరెడ్డి, శ్రీను, సీనియర్ లైన్‌మెన్ బాబురావు, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలు ఆపాలి


విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

మైదుకూరు : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ ప్రైవేటీకరణ చర్యలను వెంటనే ఆపాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళనలకు వారు ఆదివారం మైదుకూరులో మద్దతు తెలుపుతూ ప్రైవేటీకరణపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాయబ్ రసూల్, డిస్కం ఉపాధ్యక్షుడు శీలం సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రైవేటీకరించబోమని 2021లో చేసుకున్న ఒప్పందాలను ఉత్తరప్రదేశ్‌లో యోగి ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. కేంద్రం తీసుకున్న విద్యుత్ సవరణ చట్టం- 2022ను రద్దు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగసుబ్బయ్య, మైదుకూరు డివిజన్ అధ్యక్షుడు బి.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నగరవనం పనులను పరిశీలించిన డీఎఫ్ఓ


పనులను పరిశీలిస్తున్న డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని యర్రగుంట్ల రోడ్డులో ఏర్పాటు చేయనున్న నగరవనం పనులను కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పరిశీలించారు. పనులు వేగవంతంగా చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నగరవనం ప్రధాన ద్వారంలో ఏర్పాటు చేయనున్న ఆర్చీ కోసం ప్రత్యేక బృందాన్ని ఇది వరకే నియమించారు. ఈ బృందం సభ్యులు ఆర్చీ నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆర్చీ నిర్మించబోయే స్థలాన్ని డీఎఫ్ఓతో కలిసి వారు పరిశీలించారు. అలాగే మెస్ పెన్సింగ్ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ దినేష్‌కుమార్‌రెడ్డి, డీఆర్ఓ లక్షుమయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి 42 మంది రోగులను పరీక్షించి ఉచితంగా 23 మందికి ఈసీజీ, 6 మందికి గుండె స్కానింగ్ పరీక్షలు చేయించారు. వారికి తగు చికిత్సలు చేసి సలహాలు, సూచనలు ఇచ్చారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత 30 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెల మూడో ఆదివారం పేద ప్రజలకు ఉచితంగా కంటి, గుండె జబ్బుల వైద్య శిబిరం నిర్వహిస్తామని డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు.

నేడు మడూరులో ఫ్యామిలీ ఫిజిషియన్

చాపాడు : మండలంలోని మడూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. గ్రామ సచివాలయం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. మధ్యాహ్నం నుంచి గృహ సందర్శనలో భాగంగా ఇళ్లలో ఉండే దీర్ఘకాలిక రోగులను పరీక్షించి మందులు అందజేస్తామని వైద్యాధికారి తెలియజేశారు.

నేడు అల్లాడుపల్లెలో సన్మాన సభ

చాపాడు : ఇటీవల జాతీయ స్థాయిలో వేద శిఖామణి బిరుదాంకితుడుగా స్వర్ణ కంకణం పొందిన మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థాన సామవేద పండితుడు వేణుతుర్ల నరేంద్ర శర్మకు సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు దొంతు సుబ్రమణ్యం తెలిపారు. అల్లాడుపల్లె దేవస్థాన సన్నిధిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 9గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ప్రొద్దుటూరు చిన్మయా మిషన్ రచనా చైతన్య మాతాజీ, చెన్నైకి చెందిన వేద పండితుడు బ్రహ్మశ్రీ సత్యమూర్తి శ్రౌతి, ఆలయ ఈఓ శ్రీనివాసులు, తెలుగు విద్వాన్ సాంబశివారెడ్డి హాజరుకానున్నట్లు దొంతు సుబ్రమణ్యం తెలిపారు.

కవిత్రయ రచనలతో తెలుగు సాహిత్యం సుసంపన్నం

అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కవిత్రయంగా గుర్తింపు పొందిన నన్నయ్య, తిక్కన, ఎర్ర ప్రగడ రచనలతో తెలుగు సాహిత్యం సుసంపన్నం అయిందని ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జార్జికారొనేషన్ క్లబ్‌లో నందనందన కళా నాట్యమండలి ఆధ్వర్యంలో కవిత్రయ కవితా వైభవం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా భారతం నాటికి, నేటికి సజీవ సాక్ష్యమని పేర్కొన్నారు. నన్నయ, తిక్కన, ఎర్రనలు తమ అద్భుత రచనలతో ప్రజలలో చిరస్మరణీయులుగా నిలిచిపోయారన్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కవి డాక్టర్ రాధాశ్రీ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ సాహిత్యంలో లేనటువంటి పద్యాలను కవిత్రయ కవులు మనకు అందించారని తెలిపారు. నంద్యాలకు చెందిన సూరన సారస్వత సంఘం అధ్యక్షుడు డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ సాధారణ ప్రజలందరూ పాడుకునే విధంగా పద్యాలను కవిత్రయం కవులు అందించారని కొనియాడారు. ఎస్‌వీ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కవిత్రయం కవులు మహా భారతంలోని పాత్రలను కన్నులకు కట్టినట్లుగా రచించారని, ఆ పాత్రలు ఇప్పటికీ ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో నందనందన కళా నాట్యమండలి అధ్యక్షుడు, నటుడు ఎం.రామసుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రభుకుమార్, జింకా సుబ్రహ్మణ్యం, తిరుపాల్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిచిన పంటలు.. ఆందోళనలో రైతాంగం


చాపాడు: కేతవరంలో ఆరబెట్టిన తడిసిన మిరప పంట

చాపాడు : గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో మండలంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్రోణులు, ఆవర్తనాల ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న వర్షాలకు పలు రకాలైన పంటలు దెబ్బతినటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రాజుపాళెం, తిమ్మాయపల్లె, తిప్పిరెడ్డిపల్లె, అయ్యవారిపల్లె, నక్కలదిన్నె గ్రామాలలో రబీలో సీజన్‌లో సాగు చేసిన వరి పైరు ప్రస్తుతం వెన్నుదశలో ఉండటంతో పంట దిగుబడి తగ్గుతుందని రైతులు అంటున్నారు. ఇదే క్రమంలో పలు గ్రామాలలో దోస వర్షం తేమ దాటికి పండ్లు కుళ్లిపోతాయంటున్నారు. ఇటీవల పలు గ్రామాలలో పసుపు పంటను నూర్పిళ్లు చేస్తున్నారు. వర్షానికి పసుపు పంట దెబ్బతింటుందని, ఇదే క్రమంలో వర్షానికి తడిసిన ఎండుమిరప పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వీటితో పాటు ఆరుతడి పంటలైన నూగులు, మినుము, కొర్ర ఇంకా పలు రకాలైన పంటలు దెబ్బ తింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంటల రక్షణకు వినూత్న ఆలోచన


పంట పొలాలపై తళుకు తోరణాలు ఏర్పాటు చేసిన రైతులు

బద్వేలు అర్బన్ : రైతులు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కోవాలి. పొలంలో విత్తు విత్తింది మొదలు పంట దిగుబడి చేతికి వచ్చే వరకు రేయింబవళ్లు కంటికి రెప్పలా రక్షించాలి. ఈ క్రమంలోనే కొందరు రైతులు తమ పంటలను రక్షించుకునేందుకు వినూత్నంగా చేసిన ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. బద్వేలు–మైదుకూరు రహదారిలోని తొట్టిగారిపల్లె, నందిపల్లె ప్రాంతాల్లో రైతులు జొన్న, వరి, సజ్జ వంటి పంటలను సాగు చేశారు. అయితే పక్షులు, జంతువులు పంటలపై పడి తీవ్ర నష్టాన్ని కలిగిస్తుండటంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు సరికొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. తళుకు తోరణాలను పొలాల్లో పందిరి తరహాలో ఏర్పాటు చేశారు. గాలి వీచినప్పుడు ఆ తోరణాలు చేసే శబ్దం, సూర్యకిరణాలు పడినప్పుడు తళుక్కుమంటూ మెరుస్తుండటంతో జంతువులు, పక్షులు అటువైపు రావడం మానుకున్నాయి. దీంతో ఒకరిని చూసి ఒకరు సుమారు 150 ఎకరాలకు పైగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు.

ప్రైవేటు లెక్చరర్స్, టీచర్లపై చిన్నచూపు తగదు


మాట్లాడుతున్న నాగరాజు

ప్రొద్దుటూరు : ప్రైవేటు లెక్చరర్స్, టీచర్లను ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గంజికుంట నాగరాజు తెలిపారు. స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు పాఠశాల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను కేటాయించడం సిగ్గు చేటన్నారు. పాఠశాల విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులను ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు కేటాయిస్తే, పాఠశాల విద్యార్థులకు ఎవరు బోధిస్తారని ప్రశ్నించారు. ప్రైవేటు లెక్చరర్లను, టీచర్లను ఓట్లకు మాత్రమే పరిమితం చేసి పరీక్షలు నిర్వహించడంలో ఉపయోగపరని పక్కన పెట్టడం చర్చాంశంగా మారిందన్నారు. పేపర్ స్పాట్ వ్యాల్యుయేషన్ ప్రభుత్వ ఉద్యోగులచేతనే చేయించాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ తక్షణమే అనాలోచిత నిర్ణయాలను మానుకొని యథావిధిగా ప్రైవేటు లెక్చరర్స్, టీచర్లను కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఇర్ఫాన్, గురుప్రసాద్, వినోద్, రవి పాల్గొన్నారు.

రేపటి నుంచి కూలూరులో ఆధార్ శిబిరం

రాజుపాళెం : మండలంలోని కూలూరు గ్రామ సచివాలయంలో 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు తీసుకున్న ప్రతిఒక్కరూ ప్రస్తుతం అప్ డేట్ చేయించుకోవాలని, వయసు, పేరు, చిరునామా, సెల్ నెంబరు మార్పు తదితర మార్పుల కోసం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

నేడు స్పందన

గోపవరం : మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ, తహసీల్దారు దామోదర్‌రెడ్డిలు తెలిపారు. అన్నిశాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. అలాగే సమస్యలు ఏవైనా ఉంటే స్పందనలో అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధ్వాన్నస్థితిలో బీసీ బాలుర వసతిగృహం

పోరుమామిళ్ల : పట్టణంలోని కళాశాల బీసీ బాలుర వసతిగృహంలో పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని, వార్డన్ మోహన్ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రవి ఆరోపించారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘ నాయకులు బీసీ హాస్టల్ సందర్శించగా అనేక అవకతవకలు గమనించినట్లు తెలిపారు. 90 మంది విద్యార్థులున్న వసతి గృహంలో మెనూ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. వంట బాగా లేదని విద్యార్థులు వార్డన్ మోహన్‌తో చెపితే మీకు ఇది పెట్టడమే ఎక్కువ, నోరెత్తకుండా తినండని బెదిరిస్తారని విద్యార్థులు చెప్పినట్లు రవి పేర్కొన్నారు. గుడ్లు, అరటిపండ్లు నెలన్నరగా ఇవ్వడం లేదని, అడిగితే ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి, నన్ను ఏమీ చేయలేరని బెదిరిస్తున్నారని రవి తెలిపారు. ఇలాంటి వార్డన్‌పై కలెక్టర్ వెంటనే చర్య తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా దేవర మహోత్సవం


అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని కోట వీధిలో ఆదివారం పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి ఇంటిలో అర్ధరాత్రి అమ్మవార్లను కొలువు దీర్చారు. పూర్వం నుంచి ప్రతి ఏడాది ఉగాది ముందు ఆదివారం పెద్దమ్మ, చిన్నమ్మ తల్లి దేవర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవార్లను దర్శించి చల్లను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొని, భక్తులతో కిటకిట లాడింది. శ్రీ పెద్దమ్మ, చిన్నమ్మ దేవర ఉత్సవ కమిటీ ప్రతినిధులు, వలంటీర్లు భక్తులకు అసౌకర్యం కలుగకుండా సేవలందించారు. దేవర సందర్భంగా ట్రాఫిక్‌ను మళ్లించారు. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బిందె సేవ


బిందె సేవ కార్యక్రమంలో భక్తులు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం బిందె సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉగాది పండుగకు ముందు వచ్చే ఆదివారం బిందె సేవ, చల్ల కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ చైర్మన్ రాజకుల్లాయప్ప తెలిపారు. అమ్మవారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. బిందెసేవ కార్యక్రమంలో భాగంగా మల్లేలమ్మ ఆలయం వద్ద నుంచి 108 కలశాలలో గంగాజలాన్ని భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చి పెద్దమ్మ తల్లిని అభిషేకించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి చల్లని సమర్పించి పంచిపెట్టారు. కార్యక్రమం ఆలయ కమిటీ చైర్మన్ రాజకుల్లాయప్పతోపాటు కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ


తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం హిందూ ఉపాధ్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో రూపొందించిన శోభకృత్ నామ సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ఉపాధ్యాయులు భారతీయ, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టేందుకు కృషి చేస్తుండటం అభినందనీయమని తెలిపారు. హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటుమల్ల రామగోపాల్ మాట్లాడుతూ మన భారతీయ సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలు అందరిలో మంచి భావాలు, విలువలు పెంపొందిస్తాయన్నారు. నాగుల చవితి, వరలక్ష్మీ వ్రతం తదితర పండుగలు స్త్రీలు, పిల్లలు శ్రద్ధగా, ఉత్సాహంగా జరుపుకొంటారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న దండు వీరయ్య మాదిగ

ప్రొద్దుటూరు : పేదలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ తెలిపారు. ఆదివారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు రుణాలు ఇచ్చి రూపాయి వడ్డీతో గొంతుపై కత్తిపెట్టి మరీ వసూలు చేస్తున్నారన్నారు. ప్రతి బ్యాంకు ధనవంతులకు కోట్లాది రూపాయలు సబ్సిడీలు ఇస్తున్నాయని తెలిపారు. పేదవారికి మొండి చేయి చూపుతున్నాయని విమర్శించారు. దేశంలోని అన్ని బ్యాంకుల్లో అత్యధికంగా సంపన్న వర్గాలకు ఇచ్చినంత సహాయం పేదలకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పేదలకు సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో కె.నాగభూషణం మాదిగ, ఎస్.బాలలక్షుమయ్య మాదిగ, చెన్నమ్మ మాదిగ, బాలయ్య, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

యూపీ విద్యుత్ ఉద్యోగుల అరెస్టు సరికాదు


సబ్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఎలక్ట్రిసిటీ యూనియన్ నాయకులు

బద్వేలు అర్బన్ : విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను నిరసిస్తూ అక్కడి విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న సమ్మెను భగ్నం చేసేందుకు ఉద్యోగులను అరెస్టు చేయడం సరికాదని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాయబ్‌రసూల్ పేర్కొన్నారు. యూపీలో విద్యుత్ ఉద్యోగుల అరెస్టును నిరసిస్తూ ఆదివారం స్థానిక సబ్‌స్టేషన్ ఆవరణలో ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో డిస్కం ఉపాధ్యక్షులు నాగరాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, ఆయా డివిజన్ల యూనియన్ నాయకులు చెన్నకృష్ణ, శివరామకుమార్, గోపాల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గానుగపెంటకు ఉగాది పురస్కారం

గోపవరం : ప్రముఖ సాహితీవేత్త, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావుకు విజయవాడకు చెందిన నవ్యాంధ్ర రచయితల సంఘం, మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో శోభాకృతు నామ తెలుగు ఉగాది పురస్కారం ప్రకటించింది. ఈ మేరకు ఆయనకు సంస్థల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కలిమిశ్రీ, బిక్కిక్రిష్ణ, చొప్పారా ఘవేంద్రశేఖర్‌ల నుంచి ఆదివారం ఆహ్వానం అందింది. విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఈనెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

అకాల వర్షంతో రైతులకు నష్టం


పగిడాల వద్ద నేలవాలిన కొర్రపంట


రాజుపాళెంలో దెబ్బతిన్న పత్తిపంట

రాజుపాళెం : అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బ తిన్నాయి. శనివారం రాత్రి ఒక్కసారిగా వర్షం పడటంతో పంట దిగుబడులపై పట్టలు కప్పుకున్నా తడిసి ముద్దయ్యాయని రైతులు వాపోతున్నారు. కొర్ర, నూగు పంటలు నేలవాలాయని తెలిపారు. పత్తిపంటపై వర్షం పడటంతో తెల్లగా ఉన్న పత్తి నల్లగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టంగుటూరు గ్రామంలో ముమ్మరంగా పసుపు పంట నూర్పిడి జరుగుతుందని, వర్షం వల్ల నష్టమేనని చెబుతున్నారు. అకాల వర్షంతో చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.